# లోక విద్య ప్రపంచం

పక్షపత్రిక

సంపుటి-1, సంచిక-2 జనవరి- 2013 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2


## సమానత్వం కోసం నూతన చట్టాల ఆవశ్యకత

భారతరాజ్యాంగ ప్రస్తావనలో వ్యక్తిగౌరవం, జాతి ఐక్యతను దేశ అఖండతను, ప్రజల మధ్య సౌభ్రాతృత్వంను పెంపొందించుటకు చట్టాలు చేయుటకు తీర్మానించడమైనది. ప్రతి చట్టం కూడా పౌరులందరికి సామాజిక ఆర్థిక, రాజకీయ న్యాయంతోపాటు భావ ప్రకటన స్వేచ్ఛ కల్గియుండటం, ధర్మంను ఆచరించుట, అదే సమయంలో భారతదేశమును, సార్వభౌమ్య, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యముగా పరిఢవిల్లడానికి చట్టసభలకు చట్టాలను చేయడానికి అధికారం ఇవ్వడమైనది. స్థూలంగా దేశప్రజలందరికి వ్యక్తిగత గౌరవంతోపాటు సమాన అవకాశాలతో ప్రాథమిక అవసరాలన్నీ తీర్చే చట్టాలను మాత్రమే చేయాల్సి వుంది. ఒకసారి సమానత్వం కోసం చేసే ఈ చట్టాలను పరిశీలిస్తే లోకవిద్యాధరులకు అనగా బడుగు వర్గాలకు చెందిన ప్రజలందరికి ముఖ్యంగా స్త్రీలు, గిరిజనులు, షెడ్యూల్ కులమునకు చెందిన వారు, పారంపర్యంగా వృత్తులు చేసుకొనేవారు, వారికున్న జ్ఞానంతో ఆత్మగౌరవంతో వారి అవసరాల మేరకు సంపాదించుకునే తారతమ్యాలు లేని వ్యవస్థకు వ్యతిరేకంగా గడిచిన 3, 4 దశాబ్దాలనుంచి చేసిన చట్టాలపై ఒక విశ్లేషణతోనే వ్యవస్థలో సమూల మార్పులకు నాందీ పలకాల్సి ఉంది.

భారతదేశంలో అన్ని రాష్ట్రాలలోను కూడా భూపరిమితి చట్టాలు 1971 నుండి ప్రవేశపెట్టబడ్డాయి. మనరాష్ట్రంలో వ్యవసాయేతర భూములపై ఎటువంటి సీలింగ్ లేదు. అంటే పట్టణప్రాంతంలో వున్నటువంటి ధనికుల ఉత్పత్తి సాధనాలపై ఎటువంటి ఆంక్షలు లేవు. గ్రామాలలోని రైతులకు మాత్రం ఒక పంటపండే కాల్వ/చెరువుల కింద భూములు 27 ఎకరాలు, రెండు పంటలు పండే డెల్టాభూములు 18 ఎకరాలకు మించరాదు. వర్షాధార భూములు 54 ఎకరాలు మాత్రమే కల్గిగి వుండొచ్చు. అంటే గ్రామీణ ప్రాంతంలో ఎట్టి పరిస్థితులలోనూ ఒక కోటిరూపాయలు కంటే ఎక్కువ ఆస్తి కల్గియుండరాదు. పైపెచ్చు ఎకరానికి నలుగురు చొప్పున సీలింగ్ భూముల్లో 100 మందికి ఉపాధి కల్గించే అవకాశం మాత్రమే గ్రామీణ ప్రాంతంలో కల్గివుండగా, రిలయన్స్, బిర్లా, మహేంద్ర, మిట్టల్, జిందాల్ లాంటి కంపెనీలు వేలకోట్ల పెట్టుబడితో వేల ఉద్యోగులపైన పెత్తనం చెలాయించడానికి అధికారం కల్గియున్నారు.

భారతదేశ ఆర్థిక వ్యవస్థను రిజర్వ్‌బ్యాంక్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నియంత్రిస్తోంది. వేల లక్షల కోట్ల రూ॥ల పన్నును ఏవిధంగా ఖర్చు చేయాలో కేంద్రప్రభుత్వ పరిధిలో వున్న అంశం. భారతదేశ సాధారణ పౌరుని దినసరి ఆదాయం వివిధ రకాల లెక్కలలో 25 రూ. నుండి 50 రూ॥ల మధ్యనుందని నిర్ధారించడం జరిగింది. సుమారు 90 శాతం జనాభా తమ జీవితంలో వెయ్యిరూపాయల కాగితాన్ని లెక్కపెట్టే అవకాశం రాకపోవచ్చు. కానీ భారతప్రభుత్వం రిజర్వ్‌బ్యాంక్ ద్వారా చలామణి చేసే 90శాతం కరెన్సీలో 500 రూ॥లు, 1000 రూ॥లు మాత్రమేనని తద్వారా 10శాతం ధనికులు వారి సంపాదనతో విచ్చలవిడిగా ఖర్చుచేస్తూ రోజురోజు ధరలు పెంచుతూ సామాన్యుని బతుకు దుర్భరం చేస్తున్నారు. చట్టబద్ధంగా హెచ్చు విలువగల కరెన్సీతో మనజీవితాలతో ఆడుకొంటున్నారు.

అడవులు, గనులు, చెరువులు, శబ్ద తరంగాలు, జలవిద్యుత్, వాయువిద్యుత్, పెట్రోలియం ఉత్పత్తులు, బొగ్గు గ్యాస్ వంటి సహజ వనరులు మన భూమిమీద నివసించే ప్రజలకోసం ప్రకృతి ఇచ్చిన వరం. లక్షల సంవత్సరాల నుంచి ప్రతీ గ్రామంలోనూ ఒకటి లేదా రెండూ అంతకున్న ఎక్కువ చెరువులు ఉండేవి. ఈ చెరువులన్నీ ఒక గొలుసు కట్టుగా వుండి, అన్నీ ప్రాంతాలలోనూ వానాకాలంలో నీటి వనరులు సమకూర్చేవి. దీనిలో 50 శాతం పైగా నీళ్ళు సముద్రంలో కలిసే లోపుగా అనేకమంది మత్స్యకారులకు ఉపాధితోపాటు ప్రజలకు మంచి మాంసాహారాన్ని, సమతుల్య ఆహారాన్ని అందజేసేవి. చిన్న ఆనకట్టల ద్వారా నీటి నిల్వాలు జరిగేవి. పెద్దపెద్ద పరిశ్రమల కోసం విద్యుత్, ముడి పదార్థాలపై ఆదిపత్య హక్కులు ఏదో ఒక కంపెనీకి కట్టబెట్టి పెద్ద ప్రాజెక్టుల కోసం నదీ పరివాహక ప్రాంతంలో వున్నటువంటి చిన్ననీటి వనరులను కొత్తవి నిర్మించడంగానీ, పాతవాటిని బాగుచేయడం కానీ, పూర్తిగాను, పాక్షికంగాను చట్టబద్ధంగా నిషేధించారు. ఉదాహరణకు మంజీరా, మూసీ, పరివాహక ప్రాంతంలో వ్యవసాయంపై ఉన్న ఆంక్షలు, తుంగభద్ర ప్రాంతంలో వున్న నిరంతరంగా వున్న ఆంక్షలు, ఈనాడు కొత్తగా కృష్ణా, గోదావరి డెల్టాలలో ఒక పంటకు మాత్రమే నీరు అన్న ఆంక్షలు చట్టబద్ధంగా జరుగుతోంది.

అనేక యుగాలనుండి భారతదేశంలో అడవులు మేఘాల్ని వర్షింపజేసి మనందరికి నీరు అందిస్తున్నాయి. అడవుల మధ్యలోని కొండప్రాంతాల్లో వున్న ఖనిజాన్ని మన కమ్మరులు, అగారియాలు మొదలైన వారు ముడిపదార్థాలుగా సేకరించి మనకు కావల్సిన పాత్రలు, పనిముట్లు తయారుచేసేవారు. కోట్లమంది ప్రజలు అటవి ప్రాంతంలోని సుగంధ ద్రవ్యాలు, చింతపండు, ఎండిపోయిన చెట్లద్వారా కలప, బీడి ఆకు, ఇళ్ళలో వాడే వస్తువులకు కావల్సిన వెదుళ్ళు సేకరించి సమాజానికి అందించేవారు. మెట్టప్రాంతంలో కంది, పత్తి, మిరప, పొగాకు, వేరుశనగ, పసుపు, మొక్కజొన్న మొదలైనవి పండించేవారు. ఇవన్నీ కూడా వాతావరణంలో ఒక సమతుల్యత కలిగించి, విద్యుత్‌వాడకం తగ్గించేవి. ఇప్పుడవన్నీ ఉత్పత్తికి ముడి పదార్థాలై కొద్దిమంది చేతుల్లో బందీలు అవడానికి రోజూ చట్టాలు చేయడం జరుగుతోంది.

ఈ రోజు సమాచార, సాంకేతిక విప్లవంతో ప్రపంచ వ్యాప్తంగా జరిగే ప్రతీ విషయాన్ని, ప్రతీ పౌరుడు తెలుసుకునే వెసులుబాటు వచ్చింది. ప్రధానంగా ఈ రోజు ప్రతీప్రాంతంలోనూ సుమారు 100 ఛానల్స్ ద్వారా టీవిని వీక్షిస్తున్నాం. వీటన్నింటిలోనూ విశ్లేషణలు, వార్తలు, ప్రకటనలు ప్రతిక్షణం మనం చూస్తున్నాం. వీటన్నింటిద్వారా వ్యక్తిగత సంపాదన, పలుకుబడి పెంచుకోవడం ఎట్లా? నేరాలు చేయడం ఎలా? చట్టాలలో లొసుగులు ఏమున్నాయి? ఒకే వారంలో కొన్ని లక్షలు ఖర్చుపెట్టి వివిధ కోర్టులలో ఓడిపోయినప్పటికి పైకోర్టులో బెయిల్ సంపాదించే మార్గాలు, దానికి కావల్సిన వివరాలు చట్టబద్ధంగా చెప్పబడుతున్నాయి. ప్రతీగ్రామం స్థానికావసరాల కోసం స్థానిక ప్రజలతో అందరికి ఉపాధి కల్పిస్తూ, మొత్తం గ్రామం అభివృద్ధి చెందిన వార్తలు ప్రసారంకావు. ఒక ప్రాంత ప్రజలందరూ, ఆ ప్రాంత వనరులతో వారి సామూహిక కృషితో నిర్దేశిత లక్ష్యాలను సుమారుగా హెచ్చుతగ్గులు లేని సమాజ నిర్మాణంలోని ఆనందాలను ప్రచారం చేయ్యరు. ఒకవ్యక్తి కుబేరుడవటాన్ని దానికి ఆయన అవలంబించిన పద్ధతుల్ని చూపిస్తూ అందరూ ఆమార్గాన్నే అనుసరించాలనే అపోహలను ప్రచారంచేస్తుంటారు. ఒక అంబానీ, ఒక టెండూల్కర్, ఒక పెద్ద నాయకుడి కూతురిపెళ్ళి, ఒకే కుటుంబంలోని వారి నిరంతర నిస్వార్థసేవ, అందాల ప్రదర్శన పేరుతో అంగాగ ప్రదర్శనలు ఈ చానల్‌లో ప్రముఖ కార్యక్రమాలు. ఆత్మహత్యలను బలిదానాలు గానూ, ఆత్మగౌరవం గానూ ప్రచారం చేసస్తూ ఆత్మహత్యలను ప్రోత్సాహిస్తున్నారు. ఇవన్నీ చట్టబద్ధంగానే జరుగుతున్నాయి. వీటిద్వారా రాజ్యాంగం చెప్పిన సమానత్వం రావాలంటే ప్రపంచ వనరులతో పాటు ఇతర గ్రహవనరులు కలిసినా ఒక్క మన ఆంధ్రప్రదేశ్‌కు సరిపోవు.

సమానత్వం కోసం ప్రత్యామ్నాయ చట్టాలు చేయాల్సిన అవసరం లోకవిద్యాధర సమాజానికి తమ వికాసం దృష్ట్యా అత్యవసరం. దీనికోసం ప్రతీప్రాంతంలోనూ నీటివనరులు, కాపాడుకునే చిన్న చెరువులు, చెక్‌డ్యాంలు, సామూహిక భూములు అడవుల పెంపకం, కుటీరపరిశ్రమలు, స్థానిక వస్తువుల వినిమయం, వ్యక్తి సంపదకన్నా సామాజిక ఉత్పత్తి సాధనాల నిర్మాణం అత్యవసరం. దీన్ని ప్రస్తుతమున్న వ్యక్తి కేంద్రీకృత చట్టాలనుండి వ్యవస్థ కేంద్రీకృత చట్టాల ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. ముందుగా వ్యవసాయ భూమిపై సీలింగ్ వున్నట్లుగానే వ్యక్తిగత ఆస్తులపై సీలింగ్ ఏర్పరచాలి. ఉదా : ఒక పట్టణప్రాంతంలో 200 లేదా 300 గజాల కన్నా 1000 నుండి 2000 చ॥అడుగులున్న ఎక్కువ ఆస్తులనూ ప్రభుత్వపరం చేయ్యాలి. ఒకటి / రెండు కోట్ల రూ॥ల కన్నా ఎక్కువ ఆస్తులను ప్రభుత్వ ఖజానాకు బదిలీ చెయ్యాలి. 100 రూ॥ల కన్నా ఎగువ కరెన్సీని రద్దు చేయ్యాలి. సుదూరప్రాంత వస్తువుల దిగుమతులపై భారీ సుంకాలు విధించాలి. అన్ని లావాదేవీలు బ్యాంక్ ద్వారా మాత్రమే జరిగే నూతన వ్యవస్థను నిర్మించి పన్ను ఎగవేతలను అరికట్టాలి. నిర్ధిష్టకాలంలో కోర్టు కేసులు పరిష్కరించాలి. అట్లా పరిష్కరించలేని క్రిమినల్ కేసులు ఉద్యోగులమీద చార్జిషీట్లు మూసేయటం ద్వారా చట్టం అందర్కి సమంగా వర్తింపచేయాలి. క్రమంగా ఆర్థిక లావాదేవీలన్నీ బ్యాంకులద్వారా జరపడంతోపాటు వారసత్వంగా వచ్చే ఆస్తులపై పన్నులు వేయటం జరగాలి.

లోకవిద్యా ప్రపంచం కోసం చట్టబద్ధంగా ఈ మార్గాలతో పాటు ఇతర మార్గాలను అన్వేషించడానికి అటువంటి వార్తలు, విశ్లేషణలు, వ్యాసాలతో పాటు ఈ సంపాదకీయంపై అన్ని వర్గాల నుండి అభిప్రాయాలను కోరుతున్నాం.

- టి. నారాయణరావు

## ఫిబ్రవరి 23, 24 తేదీలలో లోకవిద్య జనాందోళన ముంబాయి సమావేశం

2013 ఫిబ్రవరి 23, 24 తేదీలలో ముంబాయిలో రెండు రోజుల సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో లోకవిద్యా జనాందోళన అవగాహనను సమీక్షించుకొని భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించడం జరుగుతుంది.

**23-ఫిబ్రవరి :** విద్యాశ్రమ సమితి సమావేశం, లోకవిద్యా జనాందోళన సంయోజన సమితి, మరియు సలహా సమితి సమావేశం.

**24-ఫిబ్రవరి :** లోకవిద్య సాహిత్యం-సంస్కృతిపై జాతీయ సమావేశం.

**1. లోకవిద్యా జనాందోళన :** వారణాసిలో జరిగిన నవంబరు 2011 సమావేశం ఈ క్రింది విషయాలపై ఏకాభిప్రాయం తెలియచేసింది.

- లోకవిద్యాధర సమాజం యొక్క జ్ఞాన సిద్ధాంతం ఉద్యమంగా అంగీకరించడం దేశంలోని లోకవిద్యాధర సమాజం (రైతులు, చేతి వృత్తిదారులు, ఆదివాసీ, చిన్నదుకాణాదారులు, స్త్రీలు) యొక్క దృక్పథాలను అభివృద్ధి చేయడం.
- వివిధ స్థానిక సంస్థల సంఘాలలో, కార్యాలయాల్లో, పోరాటాల్లో, ప్రచురణల ద్వారా లోకవిద్య అవగాహనను తీసుకెళ్ళడం, నూతన ద్వారాలు ఆవిష్కరించడం.
- లోకవిద్యాధర సమాజంలో వివిధ వర్గాల మధ్య సంబంధాలపై కొత్త దృక్పథం, చొరవలు ప్రదర్శించి ఐక్యతకు కృషిచేయడం ద్వారా లోకవిద్య ద్వారా సమాజాన్ని నిర్మించడం.

**ఇంతవరకు జరిగిన కార్యకలాపాలు :**

వారణాసి, సింగ్రౌలి, ఇండోర్, చీరాల మరియు దర్భంగాలో సదస్సులు జరిగాయి. 2011 నవంబరులో వారణాసి సదస్సు అనంతరం ప్రాంతీయ సమావేశాలు దర్భంగా, చీరాల, సింగ్రౌలీ జరిగాయి. 2013 జనవరి 20న ఇండోర్ సదస్సు జరిగింది. మార్చి 2012న సంయోజన సమితి, సలహసంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశాలలో లోకవిద్య జనాందోళన రాజకీయ ప్రాముఖ్యతను చర్చించడం జరిగింది.

ప్రధానమైన అంశాలను, సమస్యలను, కోర్కెలపై 12 పాయింట్లు పట్టికను 2011 డిసెంబరు వరకు లోకవిద్య

# ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా అభివృద్ధిలోనే ప్రజల ఉపాధి అవకాశాలు

60 స॥రాల స్వాతంత్ర్య పాలన అనంతరం పాలకులు అనుసరిస్తున్న అభివృద్ధి నమూనా ఫలితంగా కుటీర పరిశ్రమలు చితికిపోయి, దివాలా తీస్తున్నాయి. ప్రభుత్వరంగంలో ఏర్పరచిన పబ్లిక్ రంగ పరిశ్రమలు ఆధునీకరణ ఫలితంగా ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. గతంలో ఉక్కు ఫ్యాక్టరీలో, కొన్నివేల మంది కార్మికులు పనిచేస్తే నేడు కొన్నివందల మంది కార్మికులతో వేలమంది చేసే ఉత్పత్తినే చేస్తుండడం ఫలితంగా ఉపాధి అవకాశాలు తగ్గాయి. అదనపు విలువ అనేక రెట్లు పెరిగి పెట్టుబడిదారులు సంస్కరణల పేరుతో పబ్లిక్‌రంగ పరిశ్రమలను నష్టాల పేరుతో ప్రైవేట్ రంగానికి అప్పగిస్తున్నారు. దీనివలన వేలకోట్ల పెట్టుబడి ద్వారా కొద్దిమందికి మాత్రమే ఉపాధి కల్పించే పరిస్థితి నేటి సాంకేతిక పరిజ్ఞానం వలన ఏర్పడింది.

అభివృద్ధి పేరుతో చేపడుతున్న ఔటర్‌రింగ్ రోడ్లు, విమానశ్రయాలు, ఫ్లైఓవర్‌లు, పెద్దపెద్ద కాంప్లెక్స్‌లకు కావలసిన ఇనుక, మట్టి కొరకు చెరువులు, కొండలు, అడవులు కరిగిపోతున్నాయి. ఫలితంగా సహజవనరులు అయిన ఆయిల్, నీరు, గ్యాస్, బొగ్గు, బాక్సైట్, ఇనుప ఖనిజం ఒక మాటలో ప్రజలందరికి చెందిన ఉమ్మడి వనరులను బయటి దొంగలకు ఇంటిదొంగలు దోచిపెడుతున్నారు. నీటి వనరులకోసం బోరుబావుల సంఖ్య పెరిగిపోయి భూగర్భజలాలు అధిక వాడకంవలన కొన్ని ప్రాంతాలు ఎడారిగా మారిపోతున్నాయి. ఈ అభివృద్ధి నమూనా వల్ల పర్యావరణం విధ్వంసం అయి కరువు ప్రాంతాలుగా మారిపోతున్నాయి.

బహుళజాతి కంపెనీలు, పాలకులు, మీడియా ఈ విధ్వంసానికి కారణం ఎల్‌నినో, ఓజోన్ ప్రభావం అని మభ్యపెడుతూ వారి అభివృద్ధి నమూనా వలన జరుగుతున్న నష్టాలను దాచిపెడుతున్నారు. అభివృద్ధి పేరుతో ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో జరిపిన విధ్వంసం ఈనాడు మనదేశంలో కూడా జరుగుతోంది.

పెట్టుబడిదారీ విధానం ఇంత విశృంఖలంగా విరుచుకుపడటానికి ప్రధానకారణం ప్రత్యామ్నాయ శక్తులు బలహీన పడడం. సోషలిస్టు దేశాలయిన రష్యా, చైనాలు పెట్టుబడిదారీ అభివృద్ధి నమూనాను అనుకరించడంతో పెట్టుబడిదారి విధానం దూకుడుకు అడ్డులేకుండా పోయింది.

ప్రపంచానికి ఆదర్శంగా వున్న చైనా నేడు కమ్యూనిటీ వ్యవసాయం రద్దుచేసి వ్యక్తిగత ఆస్తులు పంపిణీ చేసి రైతులను నిస్సహాయ స్థితిలోకి నెట్టివేసింది. వ్యక్తిగత ఆస్తి విధానం, వ్యవసాయరంగంలో పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం ద్వారా మనదేశంలో లాగా మార్కెట్ వ్యవసాయం వలన రైతులు దివాలా స్థితికి చేరుతున్నారు. ప్రపంచ మార్కెట్‌కు రెడ్ కార్పెట్ పరిచి, పెద్దఎత్తున గ్రామీణ యువతీ యువకులను పారిశ్రామిక ప్రాంతాలకు తరలించి ఎటువంటి భద్రతలు లేకుండా చవకగా శ్రమశక్తిని బహుళజాతి సంస్థలు కొల్లగొట్టేందుకు సహకరిస్తోంది.

2008లో ప్రపంచాన్ని చుట్టు ముట్టిన ఆర్థిక మాద్యం వల్ల చైనా కూడా పెద్దఎత్తున నష్టపోయింది. చైనా నుండి అమెరికా తదితర దేశాలకు భారీ ఎగుమతులు నిలిచిపోవడంతో పరిశ్రమలు పెద్దఎత్తున మూతపడి వేలాది కార్మికులు ఉపాధి కోల్పోయారు. స్వంత మార్కెట్ లేకుండా విదేశీ మార్కెట్లపై ఆధారపడి చేసే వాణిజ్యం అనివార్యంగా సంక్షోభాలకు దారితీయక మానదు. ఈనాడు ప్రధానంగా చైనా వాణిజ్యం అమెరికా, యూరప్‌లకు భారీ ఎగుమతులు చేస్తూ అభివృద్ధిగా చిత్రిస్తోంది. దేశంలో వామపక్ష శక్తులు చైనా అభివృద్ధినే అభివృద్ధినే సోషలిస్టు అభివృద్ధిగా కీర్తిస్తున్నాయి. ఐ.ఎం.ఎఫ్‌లో సభ్యురాలుగా చైనా బడుగు దేశాలను ఆర్థిక దోపిడి చేస్తోంది. ఈనాటి చైనాలోని పెట్టుబడిదారి అభివృద్ధి రేపు బద్దలయ్యే సంక్షోభాల్లో అనివార్యంగా పతనం అంచులకు చేరకుండా కాపాడలేదు.

చైనాలో వ్యక్తిగత ఆస్తులు, జీతాలమధ్య అంతరాలు పెరిగిపోయి కమ్యూనిస్టుపార్టీ సంక్షోభంలో ఉందని అంగీకరిస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఆర్థిక సంస్కరణల యుగంలో ప్రజలకు ఉపాధి కల్పించే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తే తప్ప మనకు వేరే మార్గంలేదు. పెట్టుబడిదారీ అభివృద్ధి నమూనా మన సమాజంలో అమలులో వున్న నైపుణ్యాలను, సాంప్రదాయ విజ్ఞానాన్ని దొంగతనంగా కాజేసి దానిని కొత్త రూపంలో మనపై రుద్ది వ్యాపారం చేస్తోంది. ఉదాహరణకు మంచినీటి వ్యాపారం గూర్చి పరిశీలిద్దాం.

దేశంలో సహజ వనరులు నదులు, చెరువులు, సమశీతోష్ణ వాతావరణ పరిస్థితులను పరిరక్షించకుండా నిర్లక్ష్యంచేసి, విచ్చల విడిగా అడవులు నరికివేయడం, ఆక్రమించడం, భారీ పరిశ్రమలు ఏర్పరచి పర్యావరణ కాలుష్యంకు కారణమౌతున్నది. దీనివలన వర్షపాతం తగ్గడం, పెద్ద ఎత్తున బోరుబావులు తవ్వి వ్యవసాయంచేయాల్సిన స్థితి, పర్యావరణ విధ్వంసకర అభివృద్ధి వలన త్రాగునీరు సైతం ప్రజలు కొనుక్కోవల్సిన స్థితికి పాలకులు తెచ్చారు.

నీటి శుద్ధి పేరుతో యంత్రాల సహాయంతో బోరువాటర్‌ను శుద్ధిచేసి నీటి అమ్మకాలు పెద్దఎత్తున చేస్తున్నారు. నీటివనరులను పరిరక్షించి, నీటిని శుద్ధి చేసి అందరికి త్రాగునీరు సరఫరా చేయడానికి శ్రద్ద పెట్టకుండా సరిపడా నిధులివ్వకుండా తగిన నిర్వహణ చేయకపోవడంతో అందరూ నీరు కొనుక్కోవాల్సిన స్థితి కల్పిస్తున్నారు.

ఎగువ మధ్య తరగతి, మధ్యతరగతి వర్గాలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆక్వాపిల్టర్‌ల ద్వారా శుద్ధి చేసిన నీరు వాడుకుంటున్నారు. 7000 రూ॥లతో ఆక్వాపిల్టర్‌లు, ప్రతి 6 నెలలకొకసారి 700 రూ॥లు (10శాతం) రీఫిల్ మార్పు కొరకు సుమారు రోజుకు 2 రూ॥ల చొప్పున మంచినీటికి వెచ్చిస్తున్న పరిస్థితి వుంది. అంతేగాక పట్టణ ప్రాంతాలలో, విందువినోదాలలో మినరల్ వాటర్ కొనుగోలు చేయడం సర్వసాధారణంగా మారింది. ఆర్థిక స్థోమత లేనివారు స్థానికంగా సరఫరా చేసే నీటిని వాడుతూ, కలుషితనీరు కలిస్తే రోగాల పాలవుతున్నారు.

గ్రామీణ, పట్టణ ప్రజలకు నీరు శుద్ధి చేసి వాడుకునే విధానాన్ని అత్యంత చవకగా దేశంలో రూపొందించిన ఘనత సెంటర్ ఆఫ్ సైన్స్ ఫర్ విలేజెస్ (సి.వి.పి) వార్ధా వారు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో వుండే నీటి పిల్టర్‌లు చవకగా తయారు చేసారు. ఈ నీటి పిల్టర్‌లు ఎలా చేయాలో కూడా ప్రజలకు శిక్షణ ఇస్తున్నారు. వీరు తయారు చేసిన పిల్టర్‌ను టాటా కంపెనీ సహాయంతో రూపొందించారు. వడకట్టిన నీరు పరీక్షచేయగా దేశంలో అమలులో వున్న ఆక్వాగార్డ్, మినరల్ వాటర్ కంపెనీలు సరఫరా చేస్తున్న దానికన్నా నాణ్యమైనది. ఈ ప్రక్రియలో తయారయ్యే వాటర్ పిల్టర్ ఖరీదు కేవలం రూ. 400/- మాత్రమే. 8 నెలలకోసారి రీపిల్ మార్చుకునేది 100 రూ॥ మాత్రమే. గ్రామీణ ప్రాంతాలలో నీటిశుద్ధి చేసే కేంద్రాలు ఏర్పరిస్తే ఇంకా తక్కువ ఖర్చుతో నీటి పిల్టర్‌లు తయారు చేసి ప్రజలకు అందించవచ్చు.

**దీనికి కావల్సిన ముడిసరుకులు**

1) వరిపొట్టు బూడిద - 470 గ్రా॥

2) 10 మి.మి. రాళ్ళు, నది, చెరువుల దగ్గర లభించేవి 3కేజీలు

3) సిమెంట్ - 30 గ్రా॥

4) ఇసుక - 900 గ్రా॥

5) నీరుసరిపడా

బాగా కాల్చిన వరిపొట్టు బూడిద 470 గ్రా॥ నీటిలో 5 మి.లీ. హైడ్రోక్లోరిక్ ఆసిడ్ కలిపి 24 గం॥లు నానబెట్టి 3 రోజులు కడిగి ఎండబెట్టి వడగొట్టవలెను. 10 మి.మి. చిన్న సైజు రాళ్ళు 3 కేజీలు, 30 గ్రా॥ల సిమెంట్ కలిపి సరిపడా నీరు కలిపి బాగా కలిపి నిర్ణీత సైజులో సర్ది పైన క్రింద మెష్ ఉంచి 450 గ్రా॥ ఇసుక వేసి మెష్ పెట్టి సిమెంట్‌తో సీలు చేయవలెను. 21 రోజులు నీటితో తడిపి వుంచవలెను. అనంతరం ప్లాస్టిక్ బకెట్‌లో ఈ ట్రేని వుంచి కుండపై పెట్టాలి. 10 లీటర్ల నీరు 4 గం॥లలో వడకడుతుంది. ఈ విధంగా వడకట్టిన నీరు లాబరేటరీలో పరీక్షలు జరిపి అన్ని రకాలుగా నాణ్యమైనదని బ్యాక్టిరియా లేకుండా ఆరోగ్యమైన పిల్టర్‌లో చవకగా తయారు చేసారు. గ్రామంలో స్త్రీలు ముందుకు వచ్చి నీటి పిల్టర్‌లు తయారు చేస్తే అనేకమందికి ఉపాధి లభించడమే గాక ప్రతీ ఒక్కరికి ఆరోగ్యకరమైన నీటిని అందించవచ్చు. శాస్త్రీయంగా తయారుచేసి ప్రఖ్యాత లాబరేటరీలో పరీక్ష చేసి పరిక్షించుకున్న ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎవరికైనా నేర్పడానికి, దత్తాపూర్ వార్ధాలో మహారాష్ట్రలో గల సెంటర్ ఆఫ్ సైన్స్ ఫర్ విల్‌జస్ వారు అన్ని విధాలుగా సహకరిస్తున్నారు.

దీనివలన నీటి వ్యాపారం పేరుతో బడా కంపెనీలను తరిమి కొట్టడానికి, ప్రజలే ముందుకు వచ్చి ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి ప్రజలందరికి చవకగా మంచినీరు అందించడం ద్వారా ప్రత్యామ్నాయం నిర్మించుకోవచ్చు.

ఈనాడు గ్యాస్ ధరలు విపరీతంగా పెంచివేసి నెలనెలా ఒక్కో సిలిండర్‌కు 950 రూ॥లకు పెంచివేసి పాలకులు ప్రజలపై రెట్టింపు ఆర్థిక భారం వేస్తున్నారు. దీని విషయంలో కూడా పొగలేని పొయ్యిని 950 రూ॥లకు సి.ఎస్.వి. (వార్ధా) వారు తయారు చేసారు. చెట్లనుండి రాలిన ఎండుఆకులు, గడ్డి, చిన్నచిన్న పేడులు, వ్యర్థ పదార్థాల సహాయంతో రోజు గంటపైగా పనిచేసే పొగలేని పొయ్యి పైసా ఖర్చులేకుండా గ్రామీణ ప్రాంతాలలో ఉచితంగా లభించే వ్యర్థపదార్థాలతో నడిచే ఈ పొయ్యిని రూపొందించారు. దీనిని ప్రతీ గ్రామంలో తయారు చేయడం ద్వారా అనేకమంది ఉపాధి లభిస్తుంది. గోబర్ గ్యాస్ తయారీ, గోబర్ గ్యాస్ నుండి విద్యుత్ తయారీ, వర్షపునీటిని నిల్వచేయడం, భూగర్భ జలాల రీచార్జ్ మొదలైన అనేక పథకాలు తయారుచేసి జయప్రదంగా అమలుచేస్తున్నారు. ప్రతీ రంగంలో వ్యవసాయంలో, గ్రామీణ కుటీర పరిశ్రమలలో అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో వున్న వృత్తిదారులు వలసపోకుండా ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాలను అమలుచేయడం ద్వారా ప్రజల ఉపాధి అవకాశాలను గ్యారంటీ చేయగల్గుతాం. ఉపాధి అవకాశాలు కల్పించలేని పెట్టుబడిదారీ విధానంకు భిన్నంగా, దేశంలో అమలులో ఉన్న ప్రత్యామ్నాయ విధానాలను అందిపుచ్చుకొని గ్రామీణ ప్రాంతాల వికాసానికి ముందుకు రావల్సిందిగా సృజనాత్మకత గలిగిన యువతీయువకులను కోరుతున్నాం.

**- కె.జె. రామారావు**

(ఆధారం : csvwardha@gmail.com)

---

(మొదటి పేజీ తరువాత)

పంచాయితీలో (హిందీ పత్రికలో) ప్రకటించాం. దర్భంగా, సింగ్రౌలీ సదస్సులలో సావనీర్‌లు తెచ్చాం. ప్రధానంగా 3 అంశాలు ముందుకు వచ్చాయి.

- లోకవిద్యాధర సమాజంలో ప్రతీ ఒక్కరు తమ సామార్థ్యాన్ని బట్టి ఆదాయం లభించాలి (ప్రభుత్వ ఉద్యోగితో సమానంగా)
- ప్రజలను బలవంతంగా వారి భూమినుండి, పనులు చేసుకొని జీవించేవారిని అభివృద్ధి పేరుతో నిర్బంధంగా వెళ్ళగొట్టడం ఆపాలి. ఇప్పటికే ప్రాజెక్టు ప్రారంభమయితే, ప్రాజెక్టు ఖర్చుకు అయ్యే వ్యయంతో సమానంగా అక్కడి భూమికి, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి. స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ఈ మొత్తం వారి అభివృద్ధికి ఖర్చు పెట్టాలి.
- విద్యుత్ పంపిణీ అందరికీ సమానంగా (గ్రామాలకు, పట్టణాలకు మధ్య) పంపిణీ చేయాలి. స్థానిక అవసరాలు తీర్చిన తరువాత మాత్రమే ఇతర ప్రాంతాలలో అమ్ముకునే అవకాశం విద్యుత్ కంపెనీలకు ఇవ్వాలి. ఇటువంటి పాలసీ చేసిన అనంతరమే కొత్త ప్రాజెక్టులు చేపట్టాలి.

**సాహిత్యం-సంస్కృతి, కళలు, తాత్వికత ద్వారా విస్తృత ప్రచారం**

లోకవిద్యాదర సమాజ నిర్మాణానికి భారతదేశంలో నడుంకట్టుకున్న వ్యక్తులు లోక జనాందోళన పేరుతో వారణాసి కేంద్రంగా రెండు దశాబ్దాల పైగా పనిచేస్తున్న విషయం తెలిసిందే.

లోకవిద్య సమాజం గురించి చర్చించడానికి ఈ రెండు దశాబ్దాలుగా అనేక సభలు సమావేశాలు, ఊరేగింపులు, కరపత్రాలు, పక్షపత్రికలు, మాసపత్రికలు, హిందీ, తెలుగు భాషలతో పాటు అనేక భాషలలో ప్రకటించడం జరుగుతోంది.

ఈ ప్రచారానికి ఒక ఊపు అందించాలంటే కళలు, హరికథ, బుర్రకథ, ఒగ్గుకథ, తోలుబొమ్మలాటలతోపాటు ప్రస్తుత వాతావరణంలో ఇంటర్నెట్, మొబైల్ మొదలైన సాధనాల ద్వారా ప్రచారం చేయడానికి తద్వారా సమాజం కోసం సమాజ అవసరాలను చర్చిస్తూ ప్రస్తుతం మానవ సంబంధాలను హరించే ఈ వ్యవస్థ నిర్మూలన కోసం రైతుల, వృత్తి కారుల, గిరిజనులు, మహిళలు చిరువ్యాపారస్తులు మరియు పనిచేయడానికి సిద్ధపడిన దేశ నిరుద్యోగ ప్రజలకోసం ఎలా ఉపయోగించాలనేది ఆలోచించడం అత్యవసరం.

ఇది కేంద్రీకృతంగా ఒక అధిష్టానమో, ఒక సంఘమో, ఒక రాజకీయపార్టీయో చేయాల్సిన పనికాదు. ప్రజలు తమ కళ, భాష, ప్రసార సాధనాల ద్వారా, విజయవంతంమైన ఉద్యమాల గురించి ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది. ప్రాపంచీకరణ నేపథ్యంలో వ్యక్తిగత ఆస్తుల సంపద కూడాబెట్టడంలో మార్గలను విస్తృతంగా ప్రచారం చేసే సంస్కృతికి భిన్నంగా మొత్తం సమాజం అభివృద్ధికి ప్రతీవ్యక్తి సంపద సృష్టించడంలో ఆనందపడే నూతన సమాజ ఆవిష్కరణకు దోహదపడే ప్రతీ చిన్న విషయాన్ని విజయాలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా మరిన్ని విజయాలకు బాట వేస్తుందని ఆశిస్తున్నాం. దీన్లో భాగంగా 2011 నవంబరు సమావేశం మేరకు విద్యాశ్రమం బ్లాగ్‌స్పాట్, వెబ్‌సైట్‌ల ద్వారా ఒక చర్చకు నాందీపలికాం. దీన్ని గురించి మరింత విస్తృతంగా చర్చించేందుకు 23, 24 ఫిబ్రవరి, 2013లో ముంబాయి సమావేశంలో మరింత చర్చ జరుగుతుంది. 11 డిసెంబరు 2012 నాడు ఇంగ్లీష్‌లోనూ, జనవరి 6, 2013 హిందీలోనూ చర్చకు పై వెబ్‌సైట్‌లలో అంకురార్పణ జరిగింది.

**దీనిలోని ప్రధానాంశాలు**

1. మానవ ప్రగతిలో మానవజ్ఞానాన్ని సమాజంలోని కళ, భాష, తాత్వికత, ప్రచారం మొదలైన వాటిద్వారానే ప్రపంచ మార్పును అభివృద్ధిని ఉన్నతమైన నాగరికత వైపు అత్యంత మానవ విలువలతో గడపడానికి దోహదపడాలి.

ఈ చర్చ ప్రజల అభివృద్ధి కోసం, సమన్యాయ పునరుద్ధరణ కోసం, ఉన్నత మానవ సంబంధాలకోసం సమాజం మీద అంటే మానవ జాతిపైన ప్రేమ, అభిమానం కోసం నిర్వహింప బడుతోంది.

# ప్రపంచీకరణ వికృతరూపమే స్త్రీలపై అత్యాచారాలు

ఈ ప్రపంచంలో ఆర్థిక విశ్లేషకులు ప్రతీ వస్తు సంపద వెనుక ప్రకృతి వనరులు, పెట్టుబడి, మానవశ్రమ మిళితం చేసే వ్యవస్థ ద్వారానే జరుగుతోందని వాటికి అద్దె, వేతనాలు, లాభాలు ద్వారానే ధర నిర్ణయింపబడుతుందని ఆ లాభం వ్యవస్థను సృష్టించిన వ్యక్తిగతమని ఒక అభిప్రాయం. మరొక అభిప్రాయం ప్రకృతిలో నుండి మానవుని ద్వారా తయారయే వస్తువులకు మానవ జీవితానికి కావలసిన ఖర్చు ప్రకృతి పునర్‌నిర్మాణానికి అయ్యే ఖర్చు కంటే అదనంగా వచ్చే లాభాలనే అదనపు విలువని, అది సమాజపరమని సూత్రీకరించటం జరిగింది. నేడు వస్తువుల విలువ అంటే ప్రకృతి నుంచి వచ్చిన ముడిపదార్థం, వివిధ పద్ధతులలో ఉత్పత్తి అయిన విద్యుత్, మానవుని శరీర శ్రమ, దీన్ని మిళితంచేసి ఉత్పత్తి చేసే వస్తువులను ప్రపంచంలో ఎక్కడికైన ఎగుమతిచేసి అత్యధిక ధరకు అమ్ముకొని, ప్రపంచంలోని కుబేరులుగా మొదటి స్థానం ఆక్రమించటమే మానవ లక్ష్యం అన్నదే నేటి ప్రాపంచీకరణ సిద్ధాంతం. దీనిలో వస్తువు తయారికి ఎంత ప్రాధాన్యత ఉందో దానిని రవాణా చేయటం ప్రకటనల ద్వారా మార్కెట్ సృష్టించటం, అత్యధిక ధరలకు అమ్ముకొనటం, దీనికోసం ప్రభుత్వాలను ప్రలోభం పెట్టటం అంతే ప్రాధాన్యతతో కూడినవి. దీనికి మరింత వికృతరూపమే అత్యధిక చవక ధరకు సేకరించే ప్రకృతి వనరులను విద్యుత్, పనిముట్లు, మానవ శ్రమ కూడా ఒక ముడిపదార్థంగా చూడటం జరుగుతోంది.

ప్రాపంచీకరణ సూత్రంలో శ్రమ చేసే మానవుడుకూడా సాటి మనిషి అని, అతనికీ జ్ఞానం ఉంటుందని ప్రేమ, అభిమానాలు, స్పందన, కోరికలు, అభిరుచులు ఉంటాయని గుర్తించటం నిరాకరిస్తుంది. ఈ యాంత్రిక మానవుడిని ఉత్పత్తిలో భాగంగా ముడిపదార్థంగా చూడటంలోనే రాక్షస విలువలు వేళ్ళూనుకున్నాయి. ఈ ఉత్పత్తి క్రమంలో ప్రకృతిపై, సహజవనరులపై, మానవ వనరులపై రోజూ అత్యాచారం జరుగుతూనే ఉంది. శ్రమ జీవులైన కార్మికులపై, గిరిజనులపై, అడవులపై, కొండలపై, చెరువులపై, చేలపై జరిగే అత్యాచారం మనం గుర్తించటం లేదు. ఈ అత్యాచారంలో భాగమే స్త్రీలపై జరిగే నేటి అత్యాచారాలు. ఈ రోజు ప్రాపంచీకరణలో ఇది ఒక భాగమైపోయింది. పోయిన మూడు దశాబ్దాలుగా పశ్చిమాసియా, ఆఫ్రికాలో పెట్రోలు ఉత్పత్తులు పెరిగిన నాటినుంచి భారతదేశంనుంచి నిపుణత ఉన్నా లేకున్నా మానవులను దిగుమతి చేసుకొని వారిమీద ఈ అత్యాచారం జరపటం నాటి పత్రికలు చూచినవారికి ఎవరికైన గుర్తుండే ఉంటుంది. ఇంటిపని చేయటానికి వెళ్ళిన స్త్రీలపై పెద్దఎత్తున ప్రారంభమైన ఈ అత్యాచార విశృంఖలత మనదేశాన్ని కుదిపే స్థాయికి దేశ రాజధానిలో వచ్చిన సంగతి అందరికి తెలిసిందే. వారంతపు సెలవులలో ప్రపంచవ్యాప్తంగా ధనికులందరూ ఒకచోట పోగై త్రాగడం, జూదమాడటం, వ్యభిచరించటం, విశృంఖలంగా వెర్రిమొర్రి కోరికలతో జీవించటం ఈ ప్రాపంచీకరణలో భాగమే. **ఈ విష సంస్కృతికి విరుగుడు లోకవిద్య మాత్రమే.**

ఈమధ్య దేశ రాజధాని ఢిల్లీలో, ఒక విద్యావంతురాలైన యువతిపై జరిగిన సామూహిక అత్యాచారం, తరువాత ఆమె మరణంతో ప్రజాగ్రహం పెల్లుబికి దేశవ్యాప్త నిరసలకు దారి తీసింది. అయితే యీ దేశంలో స్త్రీలపై అత్యాచారం/ సామూహిక అత్యాచారాలు జరగడం యిదేమి మొదటిసారి కాదు. చివరిసారి కాబోదు. కొన్ని వందల సంవత్సరాలుగా యీ దేశంలో దళిత, గిరిజన స్త్రీలపై నిరాటంకంగా అత్యాచారం పరంపర కొనసాగుతూ వస్తోంది. సామాజిక నిర్లిప్తత, పటిష్టంగా అమలుకాని చట్టాలు ఈ అమానవీయమైన నేరాలను నిరోధించటంలో ఘోరంగా విఫలమయ్యాయి. ఫూలన్‌దేవి తరహా 'కంటికి కన్ను, పంటికి పన్ను' న్యాయం ఎంతమంది బడుగు స్త్రీలు అమలుచేయగలరు? ఈమధ్య బీహార్ రాష్ట్రంలో దళిత స్త్రీలపై జరిగిన సామూహిక అత్యాచారాలపై వెల్లువెత్తిన దేశవ్యాప్త నిరసనలలో, 'రేపిస్టు'లకు ఉరిశిక్ష ఒక్కటే సరియైన శిక్ష అనే నినాదం ఊపందుకుంది. 'కంచే చేను మేసిన' విధంగా చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే 'దంతెవాడ'లో గిరిజన యువతుల్ని సామూహిక మానభంగం చేయడంకాని, తరతరాలుగా వారి ఆవాసమైన 'అడవి' నుండి తరమివేయడాన్ని ప్రతిఘటించిన 'ఆదివాసి' యువకుల్ని కాల్చి చంపడం, తద్వారా దంతెవాడలో చనిపోయిన పోలీసుల పట్ల ప్రజాసానుభూతి లేకపోవడం జరిగింది.

స్త్రీలపై అత్యాచార, గృహహింసలాంటి చట్టాలు అమలులోకి వచ్చాక భారతీయ మహిళా లోకంనుండి అతిహేయమైన 'మానభంగం' లాంటి నేరాలకు దోషులకు తక్షణ మరణ శిక్ష ఒక్కటే సరియైనదనే నినాదం ఊపందుకుంది. బలవంతంగా భార్యను హింసించి అనుభవించడం లాంటి చర్యలను నేరాలుగా నమోదు చేసి శిక్షించే అవకాశం చట్టాలలో నామమాత్రంగా మిగిలాయి. దీనివల్ల స్త్రీల వ్యక్తిత్వం, ఆత్మగౌరవం తీవ్రంగా గాయపడివారిని అసహాయులుగా, దీనులుగా చూడటం జరుగుతోంది. స్త్రీలపై జరుగుతున్న యీ శారీరక, మానసిక అమానవీయమైన క్రూర ప్రవర్తనలకు నిరసనగా సామూహికంగా పౌరసమాజం గొంతెత్తవలసిన సమయమిది.

ఈదేశంలో తరతరాలుగా అనువంశిక వృత్తులలో సామాజిక ఉత్పత్తిలో ప్రముఖపాత్ర నిర్వర్తిస్తూ గౌరవప్రద జీవనం గడుపుతున్న 'లోకవిద్యా ధర' సమాజం పెట్టుబడిదారి వ్యవస్థ వికృత రూపమైన 'ప్రపంచీకరణ' అమలు కారణంగా, తమ సహజ సిద్ధమైన వృత్తి నైపుణ్యం నుండి, ఉత్పత్తి సామర్థ్యాలనుండి విడదీయబడి, వ్యక్తిత్వాలు కోల్పోవడం జరిగింది. పర్యవసానంగా వారు 'గుంపులో గోవిందయ్య'ల్లా, దినసరి కూలీల్లా, జీవచ్ఛవాల్లా బ్రతుకుబండి లాగుతున్నారు. ఒక్క 'డబ్బే' మానవ విలువలను నిర్వహించే కొలబద్దగా మారిన ప్రస్తుత సమాజంలో ఆధునిక విద్యావంతుల, మత, రాజకీయ, వ్యాపారవర్గాల తుచ్ఛమైన 'కోర్కె'లను తీర్చే సాధనాలుగా లోకవిద్యాధర సమాజానికి చెందినవారు బలవుతున్నారు. స్త్రీలు, వ్యవసాయదారులు, చేతివృత్తులవారు, దళితులు, గిరిజనులు, ప్రకృతిలో అంతర్భాగంగా ఉన్న సహజ సిద్ధ విజ్ఞానం కలిగి ఉత్పత్తి ప్రక్రియతో ముడిపడి ఆత్మగౌరవంతో జీవించే వారిగా, మనుషులుగా, సమాజం వాళ్ళను చూడగలిగిన రోజు ఈ దురాగతాలు వారిపై జరుగవు.

ప్రపంచీకరణ నేపథ్యంలో అవినీతిమయమైన పెట్టుబడిదారి సమాజం, లోకవిద్యాధరులైన 'స్త్రీల'ను వారి ప్రజ్ఞా పాటవాలు గుర్తించకుండా తమ 'కోర్కె'లను తీర్చే వస్తువులుగా పరిగణించడం దుర్మార్గం. మతం, ఆచారం, సాంప్రదాయాల పేరిట స్త్రీల వ్యక్తిత్వాలను అణచివేస్తూ, పురుషాధిక్య సమాజానికి పెద్దపీటవేసే చాందస భావజాలాన్నుండి బయటపడిన నాడే ఈ సామూహిక మానభంగాలు, దళిత, గిరిజనుల ఊచకోతలు, 'లోకవిద్యాధారుల' జీవించే హక్కును క్రమబద్ధంగా కాలరాయడాలు ఆగవు. అప్పుడే న్యాయం, సమానత్వం, సౌభ్రాతత్వం కూడిన సమాజం ఏర్పడుతుంది.

లోకవిద్యాధరులపై ఈ సమాజం చూపిస్తున్న ఈ వివక్షను, ఆలోచనా ధోరణిని మనం మార్చగలమా? సమాజంలో తమవంతు పాత్ర నిర్వహిస్తున్న స్త్రీలు వారి జీవిత కాలంలో అన్ని విషయాలలో సమానంగా గుర్తింపబడతారా? దానికి ముందు అణచివేతకు గురవుతున్న లోకవిద్యాధరులు తమ సహజ జ్ఞానం పట్ల 'ఎరుక' కలిగి ఉండాలి. ప్రస్తుత సమాజంలో మెజారిటి ప్రజల యాంత్రిక ఉత్పత్తిలో తమ వాటా పొందటమే 'స్వేచ్ఛ'గా భావిస్తుండడం నేటి విద్యావ్యవస్థ లక్షణంగా మారింది. ఈ ధోరణిని స్వేచ్ఛగా కాక బానిసత్వంలోకి నడిపించే ప్రక్రియగా లోకవిద్యాధర సమాజం భావిస్తుంది. లోకవిద్యాధర సమాజంపట్ల సానుభూతి తెలిపే నేటి సమాజంలోని వారు లోకవిద్యాధర పోరాటాలు ఒక ప్రణాళిక, సిద్ధాంతం ప్రకారం జరుగుతున్నాయనుకుంటే అది పొరపాటు. లోకవిద్యా పోరాటం నడుస్తున్న చరిత్రలో భాగంగా, సామాజికాభివృద్ధిలో ముందడుగుగా సాగిపోతూ, అనుభవాలనుండి ఎప్పటికప్పుడు నూతన పాఠాలు నేర్చుకుంటుంది. తమ సహజసిద్ధమైన జ్ఞానంపట్ల ఎరుక, నమ్మకం, అర్థం చేసుకోవడం ద్వారా క్రమబద్ధంగా కదులుతుంది. విజ్ఞానం, సమాజం, లాంటి పదాలపట్ల, ప్రాపంచికీకరణ శక్తుల అమానవీయ భావాలు లోకవిద్యాధరులకున్న పాత భావాల డొల్లతనాన్నీ గుర్తించి, వాటిని నిర్ద్వందంగా తిరస్కరించాల్సిన ఆవశ్యకతను వారికి వివరించాల్సిన అవసరం నేటి కర్తవ్యం.

సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, జీవనరంగాల పరస్పర సంబంధాలలో, మనుషులంతా ఒకటేనన్న అంశాన్ని నొక్కి వక్కాణించాలి. ఏరకమైన వివక్షతనూ సహించగూడదు. సహజ జ్ఞానాన్ని ఆధారంగా చేసికొని జీవనం గడుపుతున్న ప్రతిఒక్క వ్యక్తి గౌరవప్రదంగా బ్రతికే అవకాశం ప్రాథమిక హక్కుగా కలిగి ఉండాలి.

ఆత్మగౌరవంతో మనుషుల్లా జీవితాలు గడిపిన లోకవిద్యాధరుల నేటి దుస్థితికి ప్రపంచీకరణ ప్రభావమే మూల కారణంగా నేడు 'లోకవిద్య' అభిప్రాయపడుతుంది. మానవ విలువలను కాలరాస్తూ వ్యక్తి ఆస్తులను పోగేస్తూ స్త్రీలను కేవలం వస్తువులుగా, వాంఛాగ్నికి సమిధలుగా మార్చే యీ ప్రపంచీకరణ దుర్మార్గపు భావనలను దృఢ నిశ్చయంతో విడనాడినప్పుడే స్త్రీలపై దురాగతాలకు అడ్డుకట్ట వేయగలం. ఆ ప్రయత్నంలో ముందుకు కదులుదాం!

**- డా॥ బి. కృష్ణరాజులు**

# పితృస్వామ్య భావజాలాన్ని బద్ధలుకొట్టండి

డిసెంబర్ 16వ తేది ఢిల్లీలో నిర్భయపై జరిగిన అత్యాచార సంఘటన యావద్భారత దేశాన్ని కుదిపివేసింది. నిరసనజ్వాలలు మిన్నుముట్టాయి. మానవత్వమున్న ప్రతి మనిషి కన్నీరు కార్చాడు. ఇప్పటి వరకు ఎన్ని అకృత్యాలు జరిగినా ఎన్ని అత్యాచారాలు జరుగుతున్నా నిశ్శబ్దంగా ఉన్న ఈ సమాజాన్ని నిలదీసి ప్రశ్నించింది నిర్భయ. మీరందరూ ఎందుకిలా మౌనంగా ఉన్నారు? కదలండంటూ సమాజంలో జరిగే అకృత్యాలన్నింటిని ఎదిరించి పోరాడమని కర్తవ్య బోధచేసి తాను సెలవు తీసుకుంది. సమాజంలో ఇన్ని జరుగుతున్నా స్పందించని మీరు కనీసం నాకు జరిగిన అన్యాయంతో నయినా కళ్ళు తెరిచి చూడమని కనువిప్పు కలిగించింది.

అయితే జరుగుతున్న సంఘటనలన్ని వాటికవే జరుగుతున్నాయా? దానివెనుక నేపథ్యంగా ఉన్న శక్తులు ఏమిటి? అనే విషయాన్ని, సంఘటన మూలాలను గుర్తించకపోతే సమస్యకు పరిష్కారం అర్థంకాదు. అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా చెప్పుకునే భారతదేశంలో నేరాల సంఖ్య ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతోంది. ఈ ఏడాది నగరంలో 635 కేసులు నమోదు అయితే దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉంది. గత ఏడాది మహిళలపై దాడులకు సంబంధించిన కేసులలో 52 నగరాల జాబితాలో హైదరాబాద్ ప్రథమ స్థానంలో ఉంది. ఈనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయముఖ చిత్రానికి 1990ల తర్వాత వచ్చిన ఆర్థిక విధానాలే మూలాలుగా ఉన్నాయి. పబ్లిక్ రంగ వ్యవస్థలన్ని నష్టాలతో కునారిల్లుతున్న పరిస్థితిని అవకాశంగా ప్రయివేట్ శక్తులు రంగంలోకి దిగి క్రమక్రమంగా అన్ని వ్యవస్థలలోకి వ్రేళ్ళూనుకున్న పరిస్థితి ఏర్పడింది. దాని ప్రభావంతోనే ఈ రోజు అక్రమమైనింగ్‌లు, సహజ వనరుల దోపిడి, విచ్చలవిడి సంపాదనతో ఒక లంపెన్ వర్గం తయారయింది. ఈ వర్గం అన్ని వ్యవస్థలలోను చాప క్రింద నీరు లాగా ప్రవేశించి వ్యవస్థ పతనానికి దోహదకారి అవుతోంది. అక్రమ సంపాదనలు, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ బిజినెస్‌లు ఇబ్బడిముబ్బడిగా రావటంతో ఏర్పడిన లంపెన్ వర్గం, వీరికి రాజ్యం అండదండలు తోడవడంతో సమాజాన్ని నియంత్రించే స్థాయికి వచ్చింది. దీనికి తోడు ప్రభుత్వాలు ఆదాయవనరుగా భావిస్తూ ప్రజలను త్రాగుబోతులుగా చేసే మద్యం తోడవడంతో నేరాలకు నాంది పడింది. ఈ వర్గం మరింతగా బలపడి రాజకీయ రంగంలోను ప్రవేశించటంతో రాజ్యమే అవినీతి, అక్రమాలతో ఒక గూండారాజ్యంగా మారిపోయింది. ఈ లంపెన్ వర్గం నుంచి వచ్చిన పిల్లల బాధ్యతారాహిత్య ప్రవర్తన వల్ల నేరాల సంఖ్య మరింతగా పెరిగిపోతున్నాయి. కార్పొరేట్ శక్తులు విద్య, వైద్య రంగాలలో ప్రవేశించటంతో వ్యాపారంగా మారిన విద్యా వ్యవస్థలో అనారోగ్యకర పోటీ వాతావరణం డాలర్ల సంపాదనకు మాత్రమే పనికివస్తుందన్న చేదు నిజాన్ని గుర్తించాల్సిన అవసరముంది. విద్య కొనుక్కొనే వారికే, సంపన్న వర్గాలకు అందుబాటులో ఉండటమనేది పెరుగుతున్న సామాజిక అంతరాలకు అద్దంపడుతుంది. విద్యా వ్యవస్థలోని లోపాలను పక్షాళనం చేయకుండా విద్యావిధానాలు మారకుండా సమాజంలో ఏయే శక్తుల చేతిలో అధికారం, ఆధిపత్యం ఉందో వాటినుండి విద్యను ప్రభుత్వపరం చేయకుండా విలువలతో కూడిన విద్యను ఆకాంక్షించలేము. దానికి అదనంగా సాంకేతికాభివృద్ధి ఫలితంగా వచ్చినటువంటి ఇంటర్నెట్‌లు, సెల్‌ఫోన్‌లు కారణంగా యువత చెడుత్రోవ పడుతున్నదనే విషయాన్ని లండన్ సర్వే ఆఫ్ ఎకనమిక్స్ వారు చేసిన సర్వేలో తెలియజేశారు. బహుళజాతి సంస్థలు మూడవ ప్రపంచ దేశాలలో తమ వ్యాపార విస్తరణ కొరకు, తమ ఉత్పత్తులకు ఇండియా లాంటి దేశాల ప్రజలను పావులుగా వాడుకునే పరిస్థితి వల్ల ఆ సంస్కృతిలో భాగంగా వచ్చిన అందాల పోటీలు, అందంపై స్పృహ పెరిగిన కారణంగానే స్త్రీ వాణిజ్య సరుకయింది. సాంకేతిక అభివృద్ధి ఫలితంగా అందుబాటులోకి వచ్చిన ఎలక్ట్రానిక్ మీడియా కూడా ఈ సంస్కృతి ఆజ్యం పోసింది. నేరాలు ఘోరాలు అంటూ ప్రజలలో అనారోగ్యకరమైన ఆలోచనలు నింపటమే కాకుండా నేరప్రవృత్తిని పెంచే సన్నివేశాలు, పాత్రలు చిత్రీకరించటం ద్వారా (ముఖ్యంగా స్త్రీలలో) నేరపూరిత స్వభావాన్ని పెంచుతున్నాయి. వార్తా ప్రసారాల కోసం అప్రాధాన్యమైన విషయాలకు ప్రాముఖ్యత నిచ్చి వార్తలను ప్రసారం చేయడం ద్వారా విషయాల పట్ల ఉండాల్సిన అవగాహన స్థానంలో వ్యతిరేకత పెరిగి ఈ రకమైన ఉదంతాలకు ప్రేరకాలుగా మారుతున్నాయి.

ప్రపంచీకరణ విధానాలు కుటుంబం మీద, కుటుంబ సంబంధాలమీద బలమైన ముద్ర వేసింది. ఉపాధి అవకాశాల కోసం ప్రజలు పట్టణాలకు తరలిరావటంతో కుటుంబ వ్యవస్థ అనేక మార్పులకు గురైంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పునాదిగా ఉన్న కాలంలో విలువలు పూర్తిగా అంతరించి పోలేదు. మనుష్యుల మధ్య సంబంధాలు పూర్తిగా ఆర్థిక సంబంధాలుగా మారిపోలేదు. కాని ఉమ్మడి కుటుంబాల స్థానే వ్యష్టి కుటుంబాలు రావటంతో కుటుంబ సంబంధాలు పూర్తిగా ఆర్థిక సంబంధాలుగా మారిపోయాయి. విలువల పతనం అనేది ప్రారంభమయ్యింది. ఒకవైపు తమ వైయక్తిక ప్రయోజనాల కోసం కార్పొరేట్ విద్యకు బానిసలవుతున్న తల్లిదండ్రులు, మరోవైపు బాధ్యతారాహిత్యమైన స్వేచ్ఛ ఇచ్చిన తల్లిదండ్రులు. ఈరకమైన వాతావరణంలో పెరిగిన పిల్లలు సంస్కారయుతమైన ప్రవర్తనగాని, సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తులుగా మారే అవకాశం గాని లేదు. అందువలన కుటుంబ స్థాయినుండే సంస్కరణలు ప్రారంభం కావలసిన అవసరముంది.

నిర్భయపై జరిగిన ఈ అమానవీయ సంఘటనపై ప్రజలలో స్పందన రకరకాలుగా ఉంటోంది. నిందితులను వెంటనే ఉరి తీయాలని లేక కఠినంగా శిక్షించాలని ముస్లిందేశాలలో లాగా బహిరంగ శిక్షలమాదిరిగా కఠిన శిక్షలు ఉండాలని రకరకాల వాదనలు విన్పిస్తున్నాయి. చట్టాలు మార్చాలని, చట్టసవరణలు చేయాలని, చట్టాలను కఠినంగా అమలుపరచాలని మహిళా సంఘాలు పలు డిమాండ్‌లను ముందుకు తెస్తున్నాయి. కానీ వీటన్నింటికి మూలకారణమైన ఈ సంస్కృతిని పెంచిపోషిస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా దాని విధానాలను నిలదీయకుండా కేవలం పైపై చర్యల ద్వారా సమస్య పరిష్కారంకాదు. ప్రభుత్వం తన ఆదాయం కోసం మద్యాన్ని ఏరుల్లా ప్రవహించి ఈ లంపెన్ సంస్కృతిని పెంచిన ప్రభుత్వం ప్రధాన దోషి కాదా? పోలీసు, న్యాయవ్యవస్థలు స్వతంత్ర ప్రతిపత్తిగల రాజకీయ సంస్థలుగా కాకుండా రాజకీయ ఒత్తిడులకు లొంగి డబ్బు, పలుకుబడి, అధికారం గల వర్గాలను పరిరక్షిస్తు సంపన్నులకొక న్యాయం, సామాన్యులకొక న్యాయం అమలవుతుంటే న్యాయం నేతి బీరలో నేయి చందగానే ఉంటుంది.

పోలీసు వ్యవస్థలు సంస్కరించకుండా పోలీసుల నుండి భద్రత, రక్షణ కోరుకోవటం కూడా అసంబద్ధమే అవుతుంది. కాబట్టి ప్రభుత్వాలు చట్టాలను పకడ్బందీగా అమలు పరచాలని డిమాండ్ చేయడంతో పాటు పౌర సమాజ స్పందన ప్రధానమవుతుంది. పౌరసమాజం చైతన్యంతో మూకుమ్మడి ఆందోళనలు నిరంతరాయంగా జరగాలి. ఇదే కాకుండా వ్యవస్థీకృతం చేయబడ్డ భావజాలాన్ని బద్దలు కొట్టడానికి కుటుంబ స్థాయి నుండే ఈ ప్రయత్నాలు జరగాలి.

**- పి. రాజ్యలక్ష్మి**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Hyderabad - 500 060.
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, Hyderabad-500 060.

# ہندوستان کی عوام اور اسکی گربت — حصہ 7

ہندوستان کی عوام اسلئے گریب ہے کیونکہ انکے لیڈروں میں کیی کسم کی گربت دیکھنے میں آتی ہے

جیسے کہ امان کی گربت ؛ دماگی سوچ کی گربت ؛ انسانیت کی گربت ؛ فرض کی گربت وگیرہ وگیرہ. یہ لیڈر لوگ انتخابات کے باد آسانی سے بھلا دیتے ہیں کہ جس عوام نےانھے انتخابات میں جیت دلائی انکی اور انکا کچھ فرض بنتا ہے. اسکا سبسے اہل وجہ یہ ہے کی یہ اپنے وجود پے نہیں بلکہ پارٹی کے نام پے جیت حاصل کرتے ہیں. حلقہ‌انتخاب میں لاکھوں کی تعداد میں ووٹر پایے جاتے ہیں لیکن انکا انسے کوئی وابستہ نہیں ہوتا ؛ اسلئے انسے کوئی لگاؤ بہ نہیں ہوتا. پارٹی کے پیسے سے یہ جیسے تیسے چناو تو جیت لیتے ہیں لیکن پیسا کوئی بھی مفت میں تو نہیں دیتا!

اور پیسا تو پنجیپٹھی لگاتے ہیں، اور انہیں اپنا پیسا وصول تو کرنا ہی ہے. ایسا ممکن ہو اسکے لئے بے چُوک ویوستھا وجود میں ہیں. آپکو معلوم ہوگا کہ ہر سال وزیر-ا-مالِیات بجٹ سنسد میں پیش کرنے سے پہلے دیش کے بڑے بڑے صنعتکاروں سے باہمی عمل کرتے ہیں اور اس بات چیت کا موضوع انسے انکی زرورتے پوچھنا ہوتا ہے؛ یہ اسلئے کیونکہ جو دھن راشی انہونے انتخابات میں لگایئ تھی یا پھر آنے والے چناو میں لگاےگے اسکی پرتی ہونے کے لئے بجٹ میں کچھ ایسی شولیتے پابند کی جائے جسے انھ بینتھا منافع ہو. اس سلسلے میں وزیر-ا-ازم بھی بڑے بڑے صنعتکاروں سے بیٹھک کرتے رہتے ہیں. کیا کبھی ایسا ہوا ہے کہ وزیر-ا-مالِیات بجٹ سنسد میں پیش کرنے سے پہلے دیش کے کسانو اور کاریگروں سے انکی ضرورتو پے انکے ساتھ بیٹھک هوی ہو؟ نہیں. یا پھر کبھی ایسا ہوا ہے کی وزیر-ا-مالِیات نے بجٹ پیش کرنے سے پہلے منتخب سنسدو کی بیٹھک بلا کر انسے انکے حلقہ‌انتخاب کی عوام کی ضرورتو کے بارے میں پوچھا ہو؟ نہیں. اس حَقِیقَت سے یہی ظاہر ہوتا ہے کہ سرکار کو عوام کی زندگی سے کوئی وابستہ نہیں، انکا استمال صرف ووٹ پانے کے لئے کنا ہے.

عوام کی خوشحالی کی ترکیبیں بنانے کے بدلے یہ عوام میں صرف آپسی فوٹ ڈالنے کی ترکیبیں بناتے رہتے ہیں؛ مجحب اور جات-پات کے نام پر. انہونے ہر مذہب کے ٹھیکیداروں کو پال رکھا ہے. ایسے گیر- سماجی

لوگ جو خود کتنے ہی ادھرمی کیوں نہ ہوں لیکن عوام کو ابے دن مذہب کا بھاشن دیتے رہتے ہیں. آج کل ایسے گیر-سماجی لوگوں نے آپسی فساد کو بڈاوا دینے کے لئے نیے نیے ترکوں کا ازاد کیا ہے. عوام سے مخاطب ہوکر سیدھا سیدھا دوسرے مذہبوں کو سر-ا-ام گالیاں نکلتے ہیں. کانوں ویوستھا کو بھی کام نہیں کرنے دیتے. کوئی اگر بد عنوانی کے جرم میں گرفتار ہو تو جات-پات کا مدھا لے آتے ہیں. ہر ایسے ترکے اپناتے ہیں جسسے عوام کا دھیان روزمرہ کے مدھوں سے ہٹ جائے اور وہ سرکار کی سامنے ایک-جوتھ ہوکر اپنے مسلوں کے حل کی مانگ نہ رکھر پائیں. ایک ایسے ڈر اور نفرت کا ماحول پیدا کرتے ہیں جسسے عوام کے اندر کا ایک آپسی اعتماد کم ہوتا جاتا ہے. انکی مچآیی گی خلبلیوں کے باوزود محنت سے روٹی روزی کمانے والا ہر انسان یہ جانتا اور سمجھتا ہے کہ اسے کسی بھی مذہب سے کوئی دشمنی نہیں ہے، کیونکہ مذہب کا بیرلئے ہوئے وہ کسی سے بھی کسی کسم کا ویپار یا لین-دین نہیں کر سکتا. اسلئے خلبلیوں کا اسپے جیادہ دیر تک اثر نہیں رہتا. اسماجی بناوٹ والے مجرم یہ اچھے سے جانتے ہیں اسلئے وقت وقت پر مذہبی یا جاتی فساد کرواتے رہتے ہیں. یہی انکی راج نیتی ہے، یہی انکا مذہب اور یہی انکی گربت.

మీకు తెలుసా!

ఈ రోజు ఆలుగడ్డలు (బంగాళదుంపలు) కిలో రూ. 10-15/- రూ॥ల మధ్య చిల్లర వ్యాపారస్తుల వద్ద దొరుకుతోంది. బంగాళదుంపల వడియాలు - చిప్స్ 30 గ్రా॥లు 10 రూ॥లు. అంటే అదే కిలో ఆలుగడ్డలు 333/- రూ॥లకి ప్రతీరోజు స్కూలు, కాలేజీకి వెళ్ళే పిల్లలతో పాటు, సినిమాహాలు, బస్టాండ్‌లలో పెద్ద వాళ్ళు నోరుమూసుకొని చెల్లిస్తున్నారనే విషయం తెలుసా!

తటవర్తి నారాయణరావు

జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.

జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.

జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు. ఇతరులను దోచుకోవటానికి పనికొచ్చేది జ్ఞానం కాదు.

విద్య అంటే సమాజంలో అసమానతలను తొలగించేది.

వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.

అన్ని రకాల విద్యలు, వృత్తులు సమానమే

జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.

జ్ఞానం లాభాపేక్ష కోసం పరిశ్రమ కారాదు

మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన
వెబ్ పేజీ : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

**"లోకవిద్య ప్రపంచం" చదవండి, చదివించండి, చందాదారులుగా చేరండి. సంవత్సర చందా రూ. 50/-**

దీనిలోని వ్యాసాలు యథాతథంగా ఎవరైనా, ఎక్కడైనా ప్రచురించటానికి హక్కులు అందరివి.

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :

**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Hyderabad - 500 060. Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

**BOOK - POST PRINTED MATTER**
**JANUARY - 2013**

**To**

**Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Hyderabad - 500 060.**
**Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, Hyderabad-500 060.**